నమస్తే తెలంగాణ

గోషామహల్ | నాంపల్లి | ఓల్డ్‌సిటీ | అంబర్‌పేట

ఆదివారం 8, డిసెంబర్ 2024

SUNDAY, DECEMBER 8, 2024

టీవీ కళాకారులకు పురస్కారాలు ప్రదానం

కళాకారులను సత్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, డిసెంబర్ 7: స్వాతి ఆర్ట్స్ క్రియేషన్స్ అధినేత కె.వై గిరిరాజ్ నిర్వహిస్తున్న 29వ వార్షికోత్సవాలు, స్వాతి ఆర్ట్స్ క్రియేషన్స్ గోల్డెన్ స్క్రీన్ టీవీ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా మాజీ డీజీపీ గోపీనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలుగు టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనాగబాల డి.సురేశ్‌కుమార్, ప్రముఖ నిర్మాత బీఎస్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వరి, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, స్వాతి ఆర్ట్స్ క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వై. గిరిరాజ్ విచ్చేసి కళాకారులకు స్వాతి ఆర్ట్స్ క్రియేషన్స్ గోల్డెన్ స్క్రీన్ టీవీ అవార్డులను బహూకరించారు. అనంతరం దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బర్కత్‌పురకు చెందిన చంద్రశేఖర్ అరోగ్యం కొంత కాలంగా బాగలేదు. దీంతో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద రూ.21 వేలు మంజూరు కాగా ఆ చెక్కును కేంద్ర మంత్రి అందజేశారు. కార్పొరేటర్ ఉమాయాదవ్, గౌతంరావు, కన్నె రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

– కాచిగూడ, డిసెంబర్ 7

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు..

మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వెంకట్‌రావు అధ్యక్షతన తల్లిదండ్రులు, సంరక్షకుల్ని కోల్పోయిన విద్యార్థులకు శనివారం కాచిగూడ మున్నూరుకాపు సంఘంలో ప్రతిభా పురస్కారాలు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు హాజరై మాట్లాడారు. టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ జగదీశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహేందర్‌రావు, ట్రస్టీలు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ

శ్రీరమణ చౌరస్తా నుంచి వాహనాలకు అనుమతి

వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చిన సందర్భంగా స్థానికులతో కార్పొరేటర్ పద్మారెడ్డి

- 4 సంవత్సరాల నిరీక్షణకు మోక్షం
- హర్షం వ్యక్తం చేసిన వాహనదారులు

అంబర్‌పేట, డిసెంబర్ 7: అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తాలో నిర్మితమవుతున్న ఫ్లైఓవర్ కారణంగా నిలిచిపోయిన వాహనాల రాకపోకలు శనివారం మళ్లీ మొదలయ్యాయి. అయితే కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు మాత్రమే అనుమతిచ్చారు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ రహదారిని బంద్ చేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలనే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తైంది. తుది మెరుగులు దిద్దుతున్నారు. ఫ్లైఓవర్ కింద నుంచి వాహనాలు వెళ్లేందుకు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డును నిర్మించి కూడా నాలుగు నెలలు అయింది. కానీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు గల్లీల్లో నుంచి వెళ్తుండడంతో ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ అవుతున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబోలు నర్సింహారెడ్డి ఈ విషయాన్ని ట్రాఫిక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంతోష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు వాహనాలను అనుమతిస్తే ఎలాంటి ఇబ్బందులు రావొచ్చనే విషయాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పెద్ద వాహనాలు కాకుండా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనుమతించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు, ఎస్సై గోపీకిషన్‌రెడ్డిలు లైట్ వెహికిల్స్‌కు అనుమతిచ్చారు. ఈ సందర్భంగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబోలు నర్సింహారెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, కాలేరు మణికాంత్, కె.మధుసూదన్‌రెడ్డి, ఎ.అనిల్, కె.రామారావుయాదవ్, కె.లింగారావు, సీపీఎం నాయకుడు ఎం.మహేందర్ తదితరులు ఛే నెంబర్ చౌరస్తాకు చేరుకొని వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. నాలుగేళ్లుగా నరకం అనుభవిస్తున్న వాహనదారులు ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. అయితే వాహనాల అనుమతితో ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. వాహనదారులు కూడా పోలీసులకు సహకరించాలని అన్నారు.

శ్రీరమణ చౌరస్తా నుంచి మొదలైన వాహనాల రాకపోకలు

తోటి వారిని ఆదుకోవడం అభినందనీయం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 7. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పొరుగు సేవల విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి సింగరేణి భవన్ ఉద్యోగులు ఆర్థిక సహాయం చేసి మనవతా దృక్పథాన్ని చాటుకున్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పుష్ప కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం, అలాగే పొరుగు సేవల విభాగంలో పనిచేస్తున్న హబీబ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో ఆయనకు రూ. 25వేల ఆర్థిక సాయం జనరల్ మేనేజర్(కో ఆర్డినేషన్) ఎం. సుభానీ చేతుల మీదుగా సింగరేణి భవన్‌లో శనివారం అందజేశారు. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకునేందుకు సింగరేణి భవన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సహాయం అందించిన వారిని ఆయన అభినందించారు.

ఉద్యోగులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న జీఎం సుభాని

శ్రీకృష్ణ మందిరం ట్రస్టు బోర్డు సభ్యుల తీరుపై నిరసన



సంతకాల సేకరణ చేస్తున్న అయ్యప్పస్వాములు

అంబర్‌పేట, డిసెంబర్ 7 : గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం ట్రస్టు బోర్డు సభ్యులు వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ అయ్యప్పస్వాములు శనివారం మందిర్ దగ్గర నిరసన చేపట్టారు. పెద్దసంఖ్యలో అయ్యప్పస్వాము లు వచ్చేసీ ట్రస్టు బోర్డు తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. గురుస్వాములు మాట్లాడుతూ.. ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ట్రస్టు బోర్డు విఫలమైందని, అయ్యప్ప దీక్షల సందర్భంగా ఆలయంలో పడి వెలిగించే విషయంలో సైతం ట్రస్టు బోరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. అయ్యప్ప పడిపూజకు ట్రస్ట్ రూ.6,500 వసూలు చేస్తుందని, పడిపూజ బుక్ కానిచో ట్రస్టు వాళ్లే పూజను నిర్వహించాల్సి ఉండగా అలా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటిని నిరసిస్తూ సంతకాల సేకరణ కూడా చేపట్టారు. శ్రీకృష్ణ మందిరం ట్రస్టు నిర్లక్ష్య వైఖరిపై సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గురుస్వాములు సతీశ్‌ముదిరాజ్, అంబటి గిరిరాజు, తిరుపతి గుప్తా, మురుగన్, లక్ష్మణ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, వన్నడి రమేశ్, శివకుమార్‌గుప్తా పాల్గొన్నారు.

కీలు గుర్రం పుస్తకావిష్కరణ

కీలు గుర్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, డిసెంబర్ 7 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో దక్కన్ సాహిత్య సభ ఆధ్వర్యంలో డా.ఎన్.గోపీ రచించిన బాల గేయాలు(రచనా కాలం1965–66) 'కీలుగుర్రం' పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. వక్తలుగా బాల సాహితీవేత్త, బాలబాట, పిల్లల పత్రిక సంపాదకులు విశాఖపట్నం కొల్లూరు స్వరాజ్యం వెంకటరమణమ్మ, విశిష్ట అతిథులుగా డా.భూపాల్, కవి విమర్శకులు డా.ఎస్ రఘు, సభా అధ్యక్షుడుగా డా.పత్తిపాక మోహన్, చొక్కాపు వెంకటరమణ విచ్చేసి కీలు గుర్రం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సభలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు, బాలసాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

10 నుంచి ఉద్యోగుల క్రీడోత్సవాలు

సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నేతలు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 7 : డిసెంబర్ 10వ తేదీనుంచి 15వరకు దోమల్‌గూడలోని గగన్‌మహల్ గ్రౌండ్‌లో జరగనున్న తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా నిర్వహించనున్న 11వ వార్షిక క్రీడోత్సవాల నిర్వహణపై శనివారం కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం హుస్సేనీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలు జరుగుతాయని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సంఘాల నేతలు ఎం. జగదీశ్వర్, కె. వెంకటేశ్వర్లు, కొండల్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నజీర్, అరుణ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



రాంకోఠిలోని సీతారామాంజనేయ దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ రాంచందర్ రాజు దంపతులు, భక్తులు పాల్గొని శ్రీ వల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సుల్తాన్‌బాజార్

విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి సహకరిస్తాం

విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఇటీవల తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాక్సింగ్ పోటీలలో గోల్కొండ బాక్సింగ్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు 4 బంగారు మెడల్స్‌ను సాధించారు. శనివారం కోచ్ ఎజాజ్ విద్యార్థులతో కలిసి టోలిచౌకి కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 7

ప్రజలకు కరెంట్ కష్టాలు లేకుండా చూడండి

ఆబిడ్స్ డిసెంబర్ 7 : ప్రజలకు కరెంట్ కష్టాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం టోలిచౌకిలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో విద్యుత్ శాఖ అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు విద్యుత్ వినియోగం పెరుగుతుందని, దీనికి తగ్గట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా అయ్యేలా అధికారులు చూడాలన్నారు. ఈ సమావేశంలో నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, డీఈలు సుధీర్, ఫర్హత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. శనివారం స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య సూచనల మేరకు గోల్నాక చౌరస్తా నుంచి శ్రీరమణ చౌరస్తా వరకు ఆయన పారిశుధ్య పనులను పరిశీలించి రహదారులపై చెత్త వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్మికులకు సూచించారు. – గోల్నాక, డిసెంబర్ 7

చేతి పంపునకు మరమ్మతులు

అంబర్ పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో కొన్ని రోజులుగా చేతిపంపు పాడై ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులతో మాట్లాడి బోర్‌కు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తెచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– గోల్నాక, డిసెంబర్ 7

గొర్రెల కాపర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరియాదవ్

రవీంద్రభారతి, డిసెంబర్ 7 : గొర్రెల కాపరులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, వారి సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, ప్రధాన కార్యదర్శి మారం తిరుపతియాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చి హామీని ఎప్పటిలోగా నెరవేరుస్తారో అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్సీడీసీ ద్వారా తీసుకున్న రూ.100 కోట్ల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సూర్యనారాయణ యాదవ్, వెంకటయ్యయాదవ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సందీప్

అంబర్‌పేట, డిసెంబర్ 7 : సైబర్ క్రైమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన ప్రకారం.. నల్లకుంట పద్మకాలనీలో తెల్లం సునీత, తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటున్నది. అతని పెద్ద కుమారుడు సందీప్ ఐఏఎస్ అకాడమీలో టీచింగ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. అయితే సందీప్ సైబర్ క్రైమ్‌లో పెద్ద మొత్తంలో డబ్బును పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని తన చిన్నమ్మ కుమారుడు యశ్వంత్‌కు సందీప్ తెలిపాడు. యశ్వంత్ ఇదే విషయాన్ని తన తల్లికి తెలపగా, ఈ నెల 6వ తేదీన పద్మకాలనీకి వచ్చిన యశ్వంత్ తల్లి డబ్బులు పోగొట్టుకున్న విషయాన్ని తన అక్క సునీతకు చెప్పింది. సునీత ఫోన్ చేసి సందీప్‌ను నిలదీసింది. దీంతో సందీప్ తన ద్విచక్రవాహనాన్ని ఎల్లమ్మ టెంపుల్ దగ్గర పార్కింగ్ చేసి దానికి తాళం చెవి పెట్టి తన తమ్ముడు శశాంక్‌కు మెసేజ్ చేశాడు. పోగొట్టుకున్న డబ్బు తీసుకొని ఇంటికి వస్తానని చెప్పాడు. ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన సునీత నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైసూర్ రైల్లో దొంగతనం

కాచిగూడ,డిసెంబర్ 7: మైసూర్ రైల్లో ప్రయాణికుని బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన రూపేందర్ ఓస్లా బిజినెస్. ఈ నెల 4వ తేదీన మైసూర్ రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. 6వ తేదీన ఇంటికి వెళ్లి సూట్‌కేసు చూసుకునేసరికి అందులో ఉన్న 55 గ్రాముల బంగారు ఆభరణాలు కన్పించలేదు. శనివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కాచిగూడ, డిసెంబర్ 7: యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన సోహెల్ ప్రైవేటు ఉద్యోగి. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

సీఎం కప్ 2024 క్రీడా పోటీలు

మండల సమన్వయ సమావేశంలో నాంపల్లి తాసీల్దార్ ఎం. ప్రేమ్‌కుమార్

అబిడ్స్, డిసెంబర్ 7: సీఎం కప్–2024 మండల సమన్వయ సమావేశాన్ని నాంపల్లి తాసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాంపల్లి తాసీల్దార్ ఎం ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల స్థాయి పోటీల గురించి వివరించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయి పోటీలను నిర్వహిస్తామని 14 సంవత్సరాల లోపు వారికి అథ్లెటిక్స్, వాలీబాల్, యోగా పోటీలను ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లా స్థాయి పోటీలు 29వ తేదీ నుంచి జనవరి ఒకటవ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ తెలిపారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ కింగ్ కోఠి ఆసుపత్రి ద్వారా వేదిక వద్ద వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బి. విశ్వేశ్వర్, నాంపల్లి డిప్యూటీ ఈఓ వెంకటేశ్వర్లు, కబడ్డి కోచ్ ఎన్. సత్యనారాయణ, నాంపల్లి మండల ఫిజికల్ డైరెక్టర్ నఫీస్ సిద్దిఖి, రెజ్లింగ్ కోచ్ ఎం. జైపాల్, బాస్కెట్ బాల్ కోచ్ బి. విశాల్, వాలీబాల్ కోచ్ జి.వినోద్ కుమార్, హ్యాండ్ బాల్ కోచ్ కె. దీపక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

జాంబాగ్ డివిజన్‌లో కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌తో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి. రాజాసింగ్

అబిడ్స్, డిసెంబర్ 7 : జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, నాయకులు ఆల పురుషోత్తం రావులతో కలిసి గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. గోషామహల్ హజారి భవన్ లేన్‌లో సీసీ రోడ్డు పనులు, హిందీనగర్ లేన్‌లో సీసీ రోడ్డు, తోప్‌ఖానా మజీద్ వద్ద సీసీ రోడ్డు పనులు, అదే ప్రాంతంలోని మరో లేన్‌లో సీసీ రోడ్డు, ట్రూప్‌బజార్ యూసుఫేన్ టెంట్ హౌజ్ ప్రాంతంలో సీసీ రోడ్డు పనులు, ఓం నగర్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ పనులతో కలిసి మొత్తం రూ. కోటి పది లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, ఆల పురుషోత్తం, శ్రీనివాస్ యాదవ్, వనమాల గోపాల్, బంగారు సుధీర్‌కుమార్, కృష్ణ, మయూర్ కాలేకర్, నితిన్ నందకర్, అనిల్‌యాదవ్, రఘు కాంబ్లే, రామకృష్ణ, రేణుక, కాజల్, సాయికిరణ్, అరుణ్, ప్రమోద్, వినోద్, నరసింహగౌడ్, జనార్దన్, ముఖేశ్, సతీశ్, మురళి, ప్రవీణ్, పవన్, మహేశ్, సందీప్, క్రాంతి, భరత్, జై తివారి, అజ్జు, విజయ్‌రాజ్, రవి పాల్గొన్నారు.

ఉస్మానియా దవాఖాన నిర్మించకుండా చూడాలి..

గోషామహల్ ప్రాంతంలో ఉస్మానియా దవాఖాన నిర్మించకుండా చూడాలని గోషామహల్, చందన్‌వాడి వాసులు ఎమ్మెల్యే టి. రాజాసింగ్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ కో కన్వీనర్ జి. రాము మాట్లాడుతూ.. ప్రాంతంలో ఉస్మానియా దవాఖాన నిర్మించడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతారన్నారు. దవాఖానను ఇక్కడ నిర్మిస్తే పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్య తలెత్తుదుందన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దీపక్, శ్రీకాంత్, మహేశ్, సాగర్, రామ్ మంజ్రేకర్, విష్ణు, సాయి, దుర్గా, కిషన్‌లాల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు

అంబర్‌పేట, డిసెంబర్ 7 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ ప్రభుత్వ దవాఖాన ఎదురు వీధిలో చెట్లకొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదకరంగా ఉన్నాయని బస్తీవాసులు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో కార్పొరేటర్ ఉద్యానవన శాఖ సిబ్బందిని పిలిపించి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్‌సూపర్‌వైజర్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, తొలుపునూరి కిరణ్‌గౌడ్, ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

మెహిదీపట్నం, డిసెంబర్ 7 : కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్‌డివిజన్ హకీంషా కాలనీలో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ సర్కిల్ –13 ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి జీహెచ్ఎంసీ స్టాండింగ్‌కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ ప్రారంభించారు. ప్రజలకు అంతర్గత రోడ్లను నిర్మించి రవాణా ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు.

బ్యాగులు పంపిణీ

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల బ్యాగులను గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమత సంతోష్ గుప్తా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గుప్తా, విద్యార్థులు పాల్గొన్నారు.

– అబిడ్స్, డిసెంబర్ 7

ధోబీఘాట్‌లో నాలాకు మరమ్మతులు

మెహిదీపట్నం, డిసెంబర్ 7 : నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ అఫ్జల్‌సాగర్ ధోబీఘాట్‌లో నాలాకు జీహెచ్ఎంసీ అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. నాలాలో నుంచి నీరు ధోబీఘాట్‌లోకి ప్రవహిస్తూ ప్రజలకు స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై ఫిర్యాదులు అందడంతో ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ జీహెచ్ఎంసీ సర్కిల్ –12 ఈఈ లాల్‌సింగ్‌తో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీంతో అధికారులు నాలా ప్రహరీకి మరమ్మతులు పూర్తి చేశారు.

రౌడీషీటర్లు సాధారణ జీవితంలోకి రావాలి

- ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రాంబాబు

మెహిదీపట్నం, డిసెంబర్ 7: సమాజంలో పిల్లలను రౌడీల పిల్లలు అని పిలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో రౌడీషీటర్లు ఆలోచించుకోవాలని, ఇప్పటికైనా తమ రౌడీ జీవితాన్ని వదిలి సాధారణ జీవితం గడపాలని ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఫోన్‌లలో ప్రతి సమాచారం తెలుస్తున్నదని, ఈ నేపథ్యంలో మీ పిల్లలను ఎవరైనా రౌడీల పిల్లలు అని అంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో రౌడీలు ఆలోచించుకోవాలని అన్నారు. రౌడీషీటర్లు సాధారణ వ్యక్తుల్లాగా మారి సామాన్య జీవితాన్ని గడపాలని సూచించారు.

ఎస్.గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయం

గోపాల్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 7: హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు, తెలంగాణ అరేకటిక(సూర్యవంశీ)సంఘం అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు(79)సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వ్యక్తులు అన్నారు. నింబోలిఅడ్డాలోని ఏకే భవన్‌లో ఎస్.గోపాల్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భార్య జ్ఞానవతి, కుమారుడు విశాల్, కోడలు విధి, కూతుళ్లు, మనవరాళ్లతో పాటు రాజేందర్‌పటేల్‌గౌడ్, వీరస్వామి, విజయ్‌కుమార్, అనిల్, నందకిశోర్‌యాదవ్, బి.కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో ఆటోల బంద్

నగరంలోకి డీజిల్ ఆటోలను అనుమతించడం జరుగదని ప్రభుత్వం ప్రకటించినందుకు నిరసనగా శనివారం లంగర్‌హౌస్‌లో ఆటోల బంద్‌ను నిర్వహించారు. లంగర్‌హౌస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బంద్‌లో ఆటో డ్రైవర్లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్షుడు మహేశ్ కుమార్, రఘు తేజ, శ్రావన్, నాగేశ్, సల్మాన్, రామ్ నివాస్ పాల్గొన్నారు. – మెహిదీపట్నం